# దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- దివ్యాంగులకు ఆటపోటీలు

పెద్దపల్లి, డిసెంబర్14: దివ్యాంగులు అన్నీ రంగాల్లో రాణించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మైదానంలో జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అండర్ 10 –16, 17 –35ఏళ్ల లోపు దివ్యాంగులకు వేర్వేరుగా నిర్వహించిన ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. దివ్యాంగులతో కలిసి కలెక్టర్ కాసేపు క్యారం ఆడి సరదాగా గడిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. భవిత సెంటర్లలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం క్యాంప్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల కింద బ్యాంకు రుణాలు అందించి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.

**ఉత్సాహంగా.. ఉల్లాసంగా**

ఆటల పోటీల్లో దివ్యాంగులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. సాధారణ పౌరులతో తాము ఎందులోనూ తీసి పోమని నిరూపించుకునేందుకు ఆటల పోటీలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పలువురు దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు.

**బహుమతులు అందజేత**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్ ఖాన్, డీఆర్‌డీవో శ్రీధర్, డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్, డీఈవో డీ మాధవి, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ సురేష్, వినయ్ చంద్, రవికిరణ్, స్ఫూర్తి, మనో చేతన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



జూలపల్లిలో రోడ్డుపై బైఠాయించిన ఆటో డ్రైవర్లు

# మా పొట్ట కొట్టొద్దు

- మహాలక్ష్మి పథకం రద్దు చేయండి
- ఆటో డ్రైవర్ల ఆందోళన

జూలపల్లి, డిసెంబర్ 14 : మహాలక్ష్మి పథకంతో మా పొట్ట కొట్టొద్దంటూ మండలం లోని ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఆటో యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి ఆటో డ్రైవర్లు తరలి వచ్చి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గురువారం రాస్తారోకో చేశారు. ఆటోలపై ఆధారపడి బతుకుతున్న తమకు ప్రభుత్వం ఉపాధి చూపకుండా 'మహాలక్ష్మి' పథకంతో రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి ఆటోలు కొనుక్కున్నామని, నెలనెలా కిస్తీలు ఎలా కట్టాలని, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లను పోలీసులు అడ్డుకుని చెదరగొట్టారు. అక్కడి నుంచి ఆటో డ్రైవర్లు తహసీల్ కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. బషీరొద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు మద్దెల నరేశ్, ఉపాధ్యక్షుడు ఎండీ అయూబ్, కోశాధికారి వేల్పుల సందీప్, కార్యదర్శి దామ రవి, నాయకులు ఒల్లాజి మహేందర్, ఉయ్యాల వెంకటేశ్, ఇంజపూరి సోని, కోడి ప్రేమ్ కుమార్, కుర్ర సతీశ్, పసుమనోటి లక్ష్మణ్, కల్లెపెల్లి కిషన్, పూరెల్ల గంగయ్య, తాజొద్దీన్, ఒల్లాజి స్వామి పాల్గొన్నారు.

### మేం బతుకుడెట్ల..?



మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. ప్రయాణికులు రాక ఆటోలు కదలడం లేదు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మాకు ఉపాధి లేకుండా పోతున్నది. మండలంలో దాదాపు 5 వందల ఆటోలు ఉన్నయ్. మా కుటుంబాలు రోడ్డున పడుతున్నయి. ప్రభుత్వం మాకు ఉపాధి మార్గం చూపాలి. మా పొట కొట్టద్దు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలె. ప్రతి నెల ఈఎంఐ కట్టకపోతే ఫైనాన్స్ వాళ్లు మా ఆటోలు తీసుకుపోతరు. డ్రైవర్లు ఏం పని చేసి బతకాలో తెలియక ఆందోళన చెందుతున్నరు. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

**మద్దెల నరేశ్, ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు (పెద్దాపూర్)**

### ఉపాధి చూపించాలి..



మా బతుకులు దినదిన గండంగా మారుతునాన్నయ్. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి మాకు బతుకుదెరువు లేకుండా రోడ్డుపాలు చేస్తున్నరు. ఆటోలు నడవక అవస్థలు పడుతున్నమ్. చేతిలో రూపాయి లే ఇబ్బంది పడుతున్నం. ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న మా బతుకులు ఆగమైపోతున్నయ్. సర్కార్ మాకు ఏదైనా ఉపాధి చూపించాలి. అప్పులు చేసి కొన్న ఆటోలను ఏం చేయాలో అర్థం కావడం లేదు. మా డ్రైవర్ల బతుకులు ఆగం చేసింద్రు. మా బతుకుదెరువు గురించి ఆలోచించాలి.

**ఒల్లాజి మహేందర్, ఆటో యూనియన్ గ్రామాధ్యక్షుడు (జూలపల్లి)**

## ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సింధూజ, తదితరులు

ఎలిగేడు, డిసెంబర్ 14: మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న పురాతన హనుమాన్ ఆలయాన్ని తొలగించి నూతన ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్ బూర్ల సింధూజ భూమిపూజ చేశారు. పక్కనే మార్కండేయ మహామందిర నిర్మాణానికి పద్మశాలీ సంఘ అధ్యక్షుడు బూర్ల వెంకట సత్యం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ పోషకులు వెంగళదాసు భాస్కర్, రాజమౌళి, బూర్ల రాజేశం, బింగి రాజు, పర్శ శ్రీనివాస్, బూర్ల రంగస్వామి, బూర్ల జనార్దన్, కుసుమ రమేశ్, శివపల్లి సత్యం, గ్యాజంగి శంకరయ్య, ముల్క సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు వేముల రాజమౌళి, బూర్ల సత్యనారాయణ, పొరండ్ల కుమారస్వామి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉడుత చంద్రయ్య, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సయ్య, పలువురు భక్తులు గ్రామ మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓటు హక్కు కల్పించాలి

జూలపల్లి, డిసెంబర్ 14 : వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ బషీరొద్దీన్ సూచించారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులపై బీఎల్వోలతో గురువారం సమావేశమయ్యారు. గ్రామాల్లో ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రజలను చైతన్యవంతం చేయాలని తెలిపారు. ఇక్కడ డీటీ అబూబాకర్, ఆర్ఐలు పాల్గొన్నారు.

ముత్తారం, డిసెంబర్ 14: స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ బండి రాజేశ్వరి బీఎల్వోలతో సమావేశమయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై బీఎల్వోలకు సూచనలు చేశారు. నాయబ్ తహసీల్దార్ ఉదయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ భవానీప్రసాద్, గిర్దావర్ శ్రీధర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఓదెల, డిసెంబర్ 14: బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో పొత్కపల్లి గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి బాల వికాస స్వచ్ఛంధ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ బాధ్యు లు తెలిపారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 14 : వరల్డ్ స్కిల్ కాంపిటేషన్‌లో పాల్గొనేందుకు ఈనెల 20లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర, ప్రీ నేషనల్, నేషనల్, ఇంటర్నేషల్ స్థాయిలో నిర్వహించబడతాయని పేర్కొన్నా రు. అర్హత కలిగిన అభ్యర్థులు దాదాపు 50కి పైగా నైపుణ్యాల్లో పోటీ పడవచ్చని, ఆటో బాడీ రిపేర్, ఆటో మొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపి, సీఎన్‌సీ మిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐటి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఫర్ బిజినెస్ జాయినరీ మొదలైన నైపుణ్యాల్లో పోటీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన, అర్హులైన అభ్యర్థులందరూ స్కిల్ ఇండియా డిజిటల్ https://www.skillindiadigital.gov.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబర్ 20లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తిరుపతిరావు పేర్కొన్నారు.



కాల్వశ్రీరాంపూర్ : నినాదాలు చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

## పోస్టల్ ఉద్యోగుల సమ్మె

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్14: పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాల్వశ్రీరాంపూర్‌లో పోస్టల్ సిబ్బంది గురువారం పోస్టాఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చే దాకా సమ్మె చేస్తామని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు రాజ్‌మహమ్మద్, శ్రీనివాస్, సంతోష్, సత్తయ్య, రాజబాబు, చోటెమియా, శివ, జావీద్ అలీ, అజయ్, చందు, వెంకటేశ్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, డిసెంబర్ 14 : పోస్టల్ జేఏసీ పిలుపు మేరకు సుల్తానాబాద్‌లోని పోస్టాఫీస్ ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ డివిజన్ కార్యదర్శి శంకరయ్య మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండి సుల్తాన్, తిరుపతి, సుకుమార్, శ్రీనివాస్, నవనీత్, శ్రీనివాస్, జయలత, తదితరులున్నారు.

## విప్లవ సంఘాలను గెలిపించాలి

గోదావరిఖని, డిసెంబర్ 14: సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం పోరాడే విప్లవ సంఘాలను ఆదరించి గెలిపించాలని నాయకులు ఐ కృష్ణ, సీతారామయ్య, జీ రాములు కోరారు. జీడీకే–2ఏ గనిపై గురువారం జరిగిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఆటుపోట్లు, రాజీలేని పోరాటాలు చేసిన చరిత్ర విప్లవ సంఘాలదేనని స్పష్టం చేశారు.న్నారు. సింగరేణి ప్రైవేటీకరణను కూడా అడ్డుకునే శక్తి విప్లవ సంఘాలకు మాత్రమే ఉందన్నారు. ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు విప్లవ సంఘాలను ఆదరించి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లేశ్, నరేశ్, కే.విశ్వనాథ్, రామకృష్ణ, రాయమల్లు, రత్నకుమార్, దుర్గయ్య, కొమురయ్య, యాకయ్య, రవికుమార్, రాజన్న తదితరులున్నారు.